నేడు ఓయూలో ప్రొ.జయశంకర్ 14వ స్మారకోపన్యాసం



ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ సిద్ధాంత కర్త మాజీ వీసీ ప్రొ.జయశంకర్ 14వ స్మారకోపన్యాసం నేడు ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ ఈసీఈ ఆడిటోరియంలో మధ్యాహ్నం 2 గంటలకు జరగనున్నట్లు డా.ఉపేందర్‌రావు, డా. దుబ్బ రంజిత్ తెలిపారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.కాశీం వర్ధంతి విజయవంతం కోసం రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమానికి అందరూ రావాలని ఆహ్వానించారు.

సురవరం మరణం బాధాకరం

బౌద్ధనగర్: సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి మరణం బాధాకరం అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రవిప్రసాద్‌గౌడ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సౌమ్యుడు, మృదుస్వభావి, అందరితో కలసి మెలసి ఉంటూ నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం పనిచేసిన నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని కొనియాడారు.

లాల్‌బజార్ మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు

బొల్లారం: అమావాస్య సందర్భంగా శనివారం తిరుమలగిరిలోని లాల్‌బజార్ మహంకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అర్చనలు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో అన్నదానం నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

మట్టి గణపతి అందజేత

బౌద్ధనగర్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయకుళ్లను ప్రతిష్ఠించడం మంచిదని కార్పొరేటర్ కంది శైలజ సూచించారు. వినాయక చవితి సందర్భంగా రాజ్యసభ మాజీ సభ్యులు జోగినపల్లి సంతోష్‌కుమార్ గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో హరితసేనలో భాగంగా పాలెం సాయి కిరణ్ శనివారం బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజకు విత్తన గణపతిని అందజేశారు.

రాజ్యాంగ రక్షణకు కృషి చేద్దాం

ఉస్మానియా యూనివర్సిటీ: రాజ్యాంగ రక్షణకు కృషి చేద్దామని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం ఓయూలోని మెకాస్టార్ ఆడిటోరియంలో ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో హ్యూమన్ రైట్స్ అండ్ కాన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా అనే అంశంపై జాతీయ సదస్సు జరిగింది. కార్యక్రమానికి కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ నవోదయ సిద్ధు అధ్యక్షత వహించగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రొ.గాలి వినోద్‌కుమార్, ప్రొ.వెంకట దాస్, ప్రొ.స్వామిదాస్, సంజీవ్‌రావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల హామీలను అమలు చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: సీఎం రేవంత్‌రెడ్డి గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని వర్సిటీల కాంట్రాక్ట్ అధ్యాపకుల జేఏసీ కన్వీనర్ డా.ధర్మతేజ శనివారం పేర్కొన్నారు. సోమవారం ఓయూకు సీఎం రేవంత్ రెడ్డి రాకను స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. బేసిక్, డీఏ, హెచ్‌ఆర్‌ఏ, 3 శాతం ఇంక్రిమెంట్‌తో కూడిన వేతనం, ఉద్యోగ భద్రత కల్పిస్తామని గతంలో సీఎం హామీ ఇచ్చారని, వాటిని అమలు చేయాలని కోరారు.

ఫుట్‌పాత్‌లపై వాహనాలకు చెక్



ప్రజలతో మాట్లాడుతున్న పోలీసులు

బొల్లారం: డోవెటన్ బజార్, చింతల్ బజార్ ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై అక్రమంగా నిలిపిన వాహనాలను పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో తొలగించారు. ఫుట్‌పాత్‌లపై వాహనాలు నిలిపివేయడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేయడంతో ఈ చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ డ్రైవ్‌లో పలు ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లను ఫుట్‌పాత్‌లపై నుంచి తొలగించారు. ఫుట్‌పాత్‌లు పాదచారుల కోసం అనే విషయాన్ని వాహనదారులు గుర్తుంచుకోవాలని, ఇకపై ఫుట్‌పాత్‌లపై వాహనాలు నిలిపితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

పహాడీ హనుమాన్ ఆలయంలో అన్నదానం

అడ్డగుట్ట: అమావాస్య సందర్భంగా శనివారం తుకారాంగేట్‌లోని పహాడీ హనుమాన్ దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ తమవంతుగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తే బాగుటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు లలిత్‌కుమార్, ప్రశాంత్, అమర్‌నాథ్, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్పష్టత లేదు.. ఆదాయం రాదు



జీహెచ్‌ఎంసీ నార్త్‌జోన్ కార్యాలయం

గందరగోళంగా ట్రేడ్ లైసెన్సుల వ్యవహారం

- అధికారులు, సిబ్బంది కొరత
- ముందుకు రాని వ్యాపార వాణిజ్య వర్గాలు
- జీహెచ్‌ఎంసీ ఉత్తర మండలం తీరు

సికింద్రాబాద్: జీహెచ్‌ఎంసీ ఉత్తర మండలం పరిధిలో ట్రేడ్ లైసెన్స్‌ల జారీ వ్యవహారం గందరగోళంగా మారుతోంది. అన్ని రకాల వ్యాపారాలు, వాణిజ్య సంస్థల నుంచి ఫీజు వసూలు చేసి, ట్రేడ్ లైసెన్స్ జారీ చేసేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. చిన్నపాటి హోటళ్ల మొదలు భారీ వ్యాపార, వాణిజ్య సంస్థల వరకు ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేసి పెద్దమొత్తంలో ఆదాయం రాబట్టాలని అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. రంగంలోకి దిగిన జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బందికి కొత్త సమస్యలు ఎదురవుతున్నాయి.

◆ ఎటువంటి వ్యాపార, వాణిజ్య సంస్థలకు ట్రేడ్ లైసెన్స్ ఇవ్వాలన్న స్పష్టత జీహెచ్‌ఎంసీ అధికారుల వద్ద లేదు. ఇదిలా ఉండగా పలు వ్యాపార సంస్థల నిర్వాహకులు మాత్రం తాము జీహెచ్‌ఎంసీ నుంచి ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాల్సిన అవసరం లేదంటూ ఫీజు చెల్లించడానికి నిరాకరిస్తున్నారు.

సమస్యాత్మకం ఇవీ!

◆ జీహెచ్‌ఎంసీ ఉత్తర మండలం (నార్త్‌జోన్) పరిధిలో సికింద్రాబాద్, బేగంపేట, అంబర్‌పేట, మల్కాజిగిరి, ముషీరాబాద్ సర్కిళ్లు ఉన్నాయి. ఈ ఐదు సర్కిళ్ల పరిధిలో రూ.కోట్లలో ఆదాయం రాబట్టాలని అధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఆస్పత్రులు, బ్యాంకులు, సినిమా థియేటర్లు, విద్యా సంస్థల నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్ తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. ఇటువంటి సంస్థల వివరాలు రాబట్టడం కోసం వ్యాపారాల వారీగా నెల రోజుల ప్రణాళికను సిద్ధం చేసుకున్న అధికారులు తీరా వసూలు కార్యక్రమం మొదలు పెట్టేసరికి సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి.

◆ విద్యాసంస్థలు, ఆస్పత్రుల నిర్వాహకులు తమకు ట్రేడ్ లైసెన్స్ అవసరం లేదని చెబుతున్నారు. సినిమా థియేటర్ల నిర్వాహకులు తాము ఎంటర్‌టైన్‌మెంట్ ట్యాక్సు చెల్లిస్తున్నందున తమకు ట్రేడ్ లైసెన్స్ అవసరం లేదంటున్నారు. పాఠశాలలు, కళాశాలలు తదితర విద్యా సంస్థల ప్రతినిధులు తమవి బ్రాంచి కార్యాలయాలు మాత్రమేనని ట్రేడ్ లైసెన్స్ విషయంలో తమ ప్రధాన కార్యాలయంలో సంప్రదించాలంటూ సమాధానం చెబుతున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారుల వద్ద కూడా ట్రేడ్ లైసెన్స్‌ల జారీ విషయంలో స్పష్టమైన మార్గదర్శక సూత్రాలు లేవు. దీంతో ట్రేడ్ లైసెన్స్‌ల వ్యవహారం నామమాత్రంగానే సాగుతోంది.

సిబ్బంది కొరత మరో సమస్య

◆ జీహెచ్‌ఎంసీ ట్యాక్సు విభాగం పరిధిలో అధికారులు సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. అరకొర అధికారులు, పర్యవేక్షకులు ఉండగా, మిగతా వ్యవహారాలన్నింటికీ అవుట్‌సోర్సింగ్ సిబ్బందిపైనే ఆధారపడాల్సి వస్తుంది. గతంలో ట్రేడ్ లైసెన్స్‌ల జారీ బాధ్యత పారిశుద్ధ్యం, హెల్త్ విభాగాల పరిధిలో ఉండేది. తాజాగా ఈ వ్యవహారాలను ట్యాక్సు విభాగానికి బదలాయించారు. దీంతో ట్రేడ్ లైసెన్స్‌ల జారీ వ్యవహారంలో తీవ్రంగా జాప్యం జరుగుతోంది. పాత లైసెన్స్ హోల్డర్లను రెన్యూవల్ చేయించడం, కొత్త వ్యాపార సంస్థల నిర్వాహకులకు అవగాహన కలిగించి లైసెన్స్‌లు జారీ చేయడం వంటి వ్యవహారాలు తలకు మించిన భారంగా మారుతున్నాయని ట్యాక్సు విభాగం అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జీహెచ్‌ఎంసీ నార్త్‌జోన్ ట్రేడ్ లైసెన్స్‌ల తీరు

సర్కిల్ పేరు	లైసెన్స్‌ల సంఖ్య	వసూలైన ఫీజు (లక్షల్లో)
సికింద్రాబాద్	2642	రూ. 70.29
బేగంపేట	9764	రూ.599.82
మల్కాజిగిరి	3726	రూ.173.47
అంబర్‌పేట	4866	రూ.281.36
ముషీరాబాద్	3798	రూ.205.54

వ్యాపారులు కోరుతున్నారిలా..

◆ ఎటువంటి వ్యాపారాలకు ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేయాలన్న విషయంలో జీహెచ్‌ఎంసీ అధికారులు స్పష్టమైన మార్గదర్శక సూత్రాలు సిద్ధం చేసుకోవాలి. తమ పరిధిలోకి వచ్చే సంస్థలకు మాత్రమే లైసెన్స్ జారీ చేయాలి. ట్రేడ్ లైసెన్స్‌ల పేరిట వ్యాపార, వాణిజ్య సంస్థల నిర్వాహకులనే వేధింపులకు గురిచేస్తున్న ట్యాక్స్ విభాగం అధికారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. నివాస ప్రాంతాల్లో కొనసాగుతున్న చిన్న తరహా వ్యాపారులకు ట్రేడ్ లైసెన్స్ నిబంధనలు వర్తించకుండా చూడాలి. వ్యాపారులకు భయభ్రాంతులకు గురిచేసి చేతివాటం ప్రదర్శించేందుకు పాల్పడుతున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి.

అభివృద్ధి పనులు ప్రారంభం



రాందాస్ గార్డెన్‌లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న భానుక నర్మద, ఎమ్మెల్యే శ్రీగణేశ్

రసూల్‌పురా: బోర్డు నామినేటెడ్ సభ్యురాలిగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఐదు నెలల్లోనే నాలుగవ వార్డు పరిధిలో బోర్డు నిధులు రూ. రెండు కోట్లు వెచ్చించి వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద తెలిపారు. శనివారం నాలుగవ వార్డు రాందాస్ గార్డెన్‌లో బోర్డు నిధులు రూ.40 లక్షల వ్యయంతో చేపట్టే తాగునీటి పైపులైన్, యూజీడీ పనులను ఎమ్మెల్యే శ్రీగణేష్‌తో కలసి నర్మద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని వార్డుల్లో సమస్యలపై దృష్టి సారించి దశలవారీగా వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, బోర్డు సీఈవో మధుకర్ నాయక్‌ల సహకారంతో నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులను చేపడతామని హామీచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సచిన్, టోపి శంకర్, విజయానంద్, నాగభూషణంరెడ్డి, ప్రేమ్‌కుమార్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

నాలా రిటర్నింగ్ వాల్ నిర్మాణ పనుల పరిశీలన



వాల్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్, సీఈవో మధుకర్‌నాయక్

రసూల్‌పురా: ప్యాట్నీ నాలా రిటర్నింగ్ వాల్ నిర్మాణ పనులను శనివారం హైడ్రా కమిషనర్ రంగనాథ్, బోర్డు సీఈవో మధుకర్ నాయక్‌లు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సెప్టెంబర్ నెల చివరి వరకు నాలా రిటర్నింగ్ నిర్మాణ పనులను పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌కు రంగనాథ్ పలు సూచనలు చేశారు. స్థానికులు కూలిన ఆలయాన్ని తిరిగి నిర్మించాలని కోరగా ఆలయం నిర్మిస్తామని విగ్రహ ప్రతిష్ఠ చేపడతామని సీఈవో, కమిషనర్ రంగనాథ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బోర్డు చీఫ్ టౌన్ ప్లానింగ్ అధికారి ఫణికుమార్, హెల్త్ సూపరింటెండెంట్ ఎం.దేవేందర్, శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.

మీడియేషన్ సెంటర్లతో సత్వర న్యాయం

కార్డినల్ పూల ఆంథోనీ



రాంగోపాల్‌పేట్: కమ్యూనిటీ మీడియేషన్ కేంద్రాల ద్వారా సత్వర న్యాయం జరగడంతో పాటు డబ్బు, సమయం వృథా కావని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కార్డినల్ పూల ఆంథోనీ అన్నారు. సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస కాలేజ్ ఆడిటోరియంలో వార్షిక తెలుగు లాయర్స్ ఫోరం ఆధ్వర్యంలో కమ్యూనిటీ మీడియేషన్ న్యూ ట్రెండ్ అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగిన సదస్సు శనివారం ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చాలా మంది పేద ప్రజలు సివిల్, కుటుంబ తగాదాలతో కోర్టుల చుట్టూ తిరుగుతూ ఉంటారని, ఏళ్ల తరబడి కేసులు నడుస్తుండటం వలన వారు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. వివిధ కమ్యూనిటీలతో కలసి ఇలాంటి మీడియేషన్ సెంటర్లు ఏర్పాటు చేయాలనే ఆలోచన గొప్పదని, అవి మంచి ఫలితాలను రాబట్టాలంటే ఆయా కమ్యూనిటీలోని పెద్దలు, కౌన్సిలర్లు, సహకరించాలన్నారు. సికింద్రాబాద్ సిటీ సివిల్ కోర్టు ప్రిన్సిపాల్ జడ్జి డాక్టర్ శ్యామ్‌శ్రీ మాట్లాడుతూ నిత్యం కేసులతో కోర్టులపై భారం పెరిగిపోతుందని, దీంతో కేసుల పరిష్కారంలో జాప్యం అవుతుందని వాపోయారు. కోర్టుల్లో చీటింగ్, చోరీ కేసులకు త్వరలో పరిష్కారం లభిస్తుందని కానీ ఫ్యామిలీ, సివిల్ కేసులు ఏళ్ల తరబడి సాగుతాయన్నారు. ఇటీవల కాలంలో విడాకుల సంఖ్య పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యామిలీ కేసులతో కుటుంబంలోని పిల్లలు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, వారికి 18 ఏళ్లు నిండే వరకు కోర్టుకు రావాల్సి వస్తుందని అన్నారు. కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లపై విస్తృతంగా ప్రచారం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీసీపీ ట్రైన్డ్ మీడియేటర్ మహ్మద్ ఆసిఫ్ అమ్జద్, ఏలూరు బిషప్ మోస్ట్ రెవరెండ్ జయరావు పొలిమేర, ఫాదర్ రాజు ,అలెక్స్ ఫాదర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యం



మడ్‌ఫోర్ట్ కంటోన్మెంట్ క్వార్టర్స్‌లో పవర్‌బోర్‌వెల్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్, నర్మద

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. శనివారం మూడవ వార్డు మడ్‌ఫోర్డ్ కంటోన్మెంట్ క్వార్టర్స్‌లో బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదతో కలసి పవర్‌బోర్‌వెల్ పనులను ఎమ్మెల్యే శ్రీగణేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలు కేవలం ఎన్నికల వరకే పరిమితమని, అధికారంలో ఉన్న ఇతర పార్టీ నాయకులతో కలసి రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. అనంతరం డ్రైవర్స్ క్వార్టర్స్, స్వీపర్స్ క్వార్టర్స్, అంబేద్కర్‌నగర్ బస్తీ, నల్లపోచమ్మ, ఎల్లమ్మ అమ్మవార్ల ఆలయాల వీధుల్లో ఎమ్మెల్యే పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి డ్రైనేజీ, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య పనులు వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు రాజేశ్‌యాదవ్, ఉత్తరయ్య, శ్రీనివాస్, మహిళలు పాల్గొన్నారు.

మొదలైన వినాయకుల సందడి



లాలాపేటకు తరలిస్తున్న బడా గణపతి

లాలాపేట: వినాయక సంబరాల సందడి మొదలైంది. ఈ నెల 27నుంచి ప్రారంభం కానున్న వేడుకలకు సంబంధించి వినాయక ఉత్సవాల నిర్వాహకులు నగర శివార్ల నుంచి విగ్రహాలను కొనుగోలు చేసి పట్టణాలకు తరలిస్తున్నారు. తీరొక్క రూపాల్లో తయారు చేసిన విగ్రహాల తరలింపుతో నగరంలో సందడి నెలకొంది. లాలాపేట గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన బడా గణపతిని శనివారం తరలిస్తున్న నేపథ్యంలో తార్నాక చౌరస్తాలో వినాయక పండగ వాతావరణం కనిపించింది. నిర్వాహకులు దానికి ముందుగా వెళ్తూ ట్రాఫిక్ క్లియర్ చేస్తూ లాలాపేట వరకు భద్రంగా తరలించారు.

కల్యాణలక్ష్మితో ఆడబిడ్డల కుటుంబాల్లో వెలుగులు

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: కల్యాణలక్ష్మి పథకంతో కేసీఆర్ ఆడబిడ్డల కుటుంబాల్లో వెలుగులు నింపారని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శనివారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బాలానగర్ మండల పరిధిలోని 15 మంది లబ్ధిదారులకు షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు అండగా నిలవాలనే ఆలోచనతోనే మాజీ సీఎం కేసీఆర్ ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక సహాయం అందించారన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద ఒక్కో లబ్ధిదారుడికి రూ.1.00,116లు అందిస్తూ వస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో సనత్‌నగర్, బేగంపేట కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, టి.మహేశ్వరిశ్రీహరి, బాలానగర్ తహసీల్దార్ కార్యాలయ ఆర్‌ఐ నాగమణి, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీహరి, ఖలీల్, శేఖర్, నాగులు, ఆరీఫ్, నోమాన్, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

చిలకలగూడ: సికింద్రాబాద్ శ్రీనివాసనగర్‌లోని శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామని తెలంగాణ దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి శైలజ రామయ్యర్ అన్నారు. ధార్మిక సలహాదారు గోవిందహరితో కలిసి శనివారం ఆమె శ్రీగిరి ప్రసన్న వెంకన్నస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. దేవాలయ శైలి, శిల్పం, ఆకృతులకు పెద్దపీట వేస్తూ, భక్తులకు సమస్త సౌకర్యాలు కల్పించేలా ఆలయాన్ని తీర్చిదిద్దిన పునర్నిర్మాణ కమిటీ సభ్యులను ఆమె అభినందించారు. పునర్నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో ఆమె స్వాగతం పలికి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, వేణుగోపాలరావు, ఈఓ రాజేష్‌కుమార్, కమిటి ప్రతినిధులు బాలభాస్కర్, ఆత్మారామసూర్యసుబ్రహ్మణ్యం, శివశంకరన్, నారాయణన్, సుజయ్‌ప్రకాశ్, షణ్ముఖరావులతోపాటు ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



ఆలయ పునర్నిర్మాణ పనులు పరిశీలిస్తున్న శైలజరామయ్యర్, ఆలయ కమిటీ ప్రతినిధులు

యూరియా అందించడంలో కేంద్రం విఫలం

అమీర్‌పేట: తెలంగాణకు యూరియా అందించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని పీసీసీ వైస్ ప్రెసిడెంట్, సనత్‌నగర్ ఇన్‌చార్జి కోట నీలిమ ఆరోపించారు. శనివారం అమీర్‌పేట పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ వర్షాకాలంలో పత్తి, వరి పంటలకు యూరియా అవసరం ఎంతో ఉంటుందని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా 2025 ఖరీఫ్ సీజన్‌లో 1.32 కోట్ల ఎకరాల్లో అన్ని రకాల పంటలు సాగవుతాయని చెప్పారు. ప్రధానంగా 62.47 లక్షల ఎకరాల్లో వరి, 48.93 లక్షల ఎకరాల్లో పత్తి, 6.69 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, మిగిలిన విస్తీర్ణంలో ఇతర ఆహార, వాణిజ్య పంటలు పండిస్తారని వివరించారు. అన్నింటికీ కలపి ఈ సీజన్‌లో తెలంగాణ రాష్ట్రానికి 8.30 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం పడగా, ఇప్పటి వరకు 5.32 లక్షల యూరియా మాత్రమే కేంద్రం సరఫరా చేసిందన్నారు. దాదాపు 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను ఇవ్వలేక పోయిందని ఆరోపించారు. దీంతో యూరియా దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమయానికి పంట పొలాలకు ఎరువులు ఇవ్వకుంటే రైతులు తీవ్రనష్టాలను చవిచూడాల్సి వస్తుందని గుర్తు చేశారు.

ఓయూలో సీఎం పర్యటనను అడ్డుకుంటాం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను అడ్డుకుంటామని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకులు జంగయ్య అన్నారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్సిటీల్లో ఖాళీగా ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్ ఉద్యోగాలు భర్తీ చేయాలని, విద్యాశాఖ మంత్రిని నియమించాలన్నారు. బ్లాక్‌గ్రాంట్స్ నిధులు పెంచాలని ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, 2 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ వేయాలని తెలిపారు. విద్యార్థులకు ఇచ్చిన ఇతర హామీలను అమలు చేసి, ఓయూలో అడుగుపెట్టాలని డిమాండ్ చేశారు.

ప్రశాంతంగా గణేశ్ ఉత్సవాలు జరుపుకోవాలి

డీజేలకు అనుమతుల్లేవ్ : ఏసీపీ శషాంక్‌రెడ్డి



అడ్డగుట్ట: వినాయక చవితి వేడుకలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకునేలా అందరూ సహకరించాలని చిలకలగూడ ఏసీపీ శషాంక్ రెడ్డి కోరారు. వినాయక చవితిని పురస్కరించుకొని శనివారం లాలాగూడ ఇన్‌స్పెక్టర్ రఘుబాబు నేతృత్వంలో గణేశ్ మండపాల నిర్వాహకులతో పోలీస్ స్టేషన్ ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఏసీపీ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా గణేశ్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలందరూ పోలీసులతో సహకరించాలని సూచించారు. గణనాథులను ప్రతిష్ఠించే నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతీరోజు రాత్రి సమయంలో మండపం వద్ద నిర్వాహకులు తప్పనిసరిగా ఉండాలని, పరిసరాల్లో అనుమానితులు ఎవరైనా సంచరిస్తే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందజేయాలని చెప్పారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ రఘుబాబు, డీఐ రామకృష్ణ, ఎస్‌ఐలు నాగరాణి, సురేశ్, లింగరాజు, యుగేంధర్ సిబ్బంది నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

శివబాగ్ పార్కు స్థలం కాలనీకే వర్తిస్తుంది

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని, కాలనీప్రతినిధులు

అమీర్‌పేట: అమీర్‌పేట శివబాగ్ పార్కు స్థలం కాలనీకే వర్తిస్తుందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ స్పష్టం చేశారు. తమ కాలనీలో స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులు స్వాధీనపర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారని కాలనీ ప్రతినిధులు శుక్రవారం ఎమ్మెల్యేను కలిసి ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన తలసాని వివిధ శాఖల అధికారులతో కలసి శనివారం కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్కు స్థలాన్ని ఎట్టి పరిస్థితుల్లో వదిలిలేది లేదని, అవసరమైతే కాలనీవాసులతో కలసి ఆందోళన చేపట్టడానికి సిద్ధమని అన్నారు. కాలనీ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలనే ఆలోచనతో పార్కును పచ్చదనంతో అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు. ఓపెన్ జిమ్ సైతం ఏర్పాటు చేయించామన్నారు. స్థానికంగా అనేక అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించిన విషయాన్ని గుర్తు చేశారు. పార్కు స్థలాన్ని ఆక్రమించాలనే దురుద్దేశంతో చేస్తున్న ప్రయత్నాలను అధికారులు అడ్డుకోవాలని ఆదేశించారు. దీనిపై 2011లోనే కోర్టు స్పష్టమైన ఆదేశాలకు సంబంధించిన ప్రత్రాలను కాలనీ వాసులు ఎమ్మెల్యే, అధికారులకు అందజేశారు. ఈ విషయంలో జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ చొరవ చూపాలని చెప్పారు. కాలనీలో పెండింగ్‌లో ఉన్న పనులను కూడా త్వరగా చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, డిప్యూటి కమిషనర్ జయంత్, డీఈ వాసుదేవరెడ్డి, వాటర్ వర్క్స్ జీఎం ప్రభాకర్, కాలనీ ప్రతినిధులు సంజీవరావు, రాజు, జట్కాని, రాంవిలాస్ బన్సాల్, సుబ్బయ్య, మధుసూదన్‌రావు, అనిల్, బీఆర్‌ఎస్ అధ్యక్షులు, నాయకులు హనుమంతరావు, కట్ట బల్‌రాం తదితరులు పాల్గొన్నారు.